నిరుపయోగంగా ఆర్టీసీ బస్టాండ్

- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు, విద్యార్థులు
- పట్టించుకోని ఆర్టీసీ యంత్రాంగం, ప్రజాప్రతినిధులు

గరిడేపల్లి : మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌కు బస్సులు రాకపోవడంతో నిరుపయోగంగా మారింది. బస్టాండ్‌లో సరైన వసతులు లేక మరమ్మతులు లేకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంటుంది. బస్టాండ్ నిరుయోగంగా మారడంతో ప్రాంగణం పలు ప్రైవేట్ వాహనాల పార్కింగ్‌కు అడ్డాగా మారుతుంది. అదే విధంగా రాత్రి సమయంలో అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారుతుంది. బస్సులు బస్టాండ్‌కు రాకుండా మండల కేంద్రంలో ప్రధాన కూడలిలో రోడ్డుపైనే ప్రయాణికుల కోసం నిలుపుతుండడంతో వెనుక నుంచి వచ్చే వాహనాలు అన్నీ ఆగాల్సిన పరిస్థితి నెలకొంటుంది. దీంతో పట్టణంలో ప్రతి రోజు ట్రాఫిక్ సమస్యతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడాల్సివస్తుంది. ప్రజా ప్రతినిధులు, అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రయాణికులు, వాహనచోదకుల పరిస్థితి దయనీయంగా మారింది. కోదాడ–జడ్చర్ల ప్రధాన రహదారిపై రోడ్డు పక్కనే ఎంతో వైలువైన స్థలంలో ఈ బస్టాండ్ నిర్మాణం జరిగినప్పటికీ నిరుపయోగంగా మారడాన్ని ఈ ప్రాంత ప్రజలు విమర్శిస్తున్నారు. విద్యార్థులు, ప్రజలు బస్టాండ్‌లోకి బస్సు వచ్చే విధంగా చూడాలని పలుమార్లు సంబంధిత అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకునే వారు కరువయ్యారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బస్టాండ్‌లోకి ఒక్క బస్సు కూడా రాకపోవడంతో ప్రయాణికులు రోడ్డుపైనే వేచి చూడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. వర్షం వచ్చినప్పుడు విద్యార్థులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ చూపి నిరుపయోగంగా ఉన్న బస్టాండ్‌లోకి బస్సు నడిపి వినియోగంలోకి తీసుకువస్తే ఎంతో ప్రయోజనంగా ఉంటుందని ప్రయాణికులు వాపోతున్నారు.


గరిడేపల్లిలో నిరుపయోగంగా ఉన్న ఆర్టీసీ బస్టాండ్

ట్రాఫిక్ సమస్యలతో ఇబ్బందులు..

మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు ఏ చిన్న వస్తువు కొనుగోలు చేయాలన్నా మండల కేంద్రానికి రావాల్సిందే. దీంతో పట్టణంలో రద్దీగా మారింది. ప్రధాన రహదారికి ఇరువైపులా కిరాణా దుకాణాలు ఉండటంతో వాహనదారులకు పార్కింగ్‌స్థలం లేకపోవడంతో రోడ్డు మీదనే వాహనాలు నిలపాల్సివస్తుంది. అదే విధంగా మండల కేంద్రానికి వచ్చే బస్సులు సైతం 100మీటర్ల దూరంలో ఉన్నా బస్టాండ్‌కు వెళ్లకుండా ప్రధాన సెంటర్‌లోనే నిలుపుతుండడంతో ప్రయాణికులు పలు దుకాణాల ఎదుట రోడ్డుపైనే నిరీక్షిస్తూ బస్సుల కోసం నిలబడాల్సి వస్తుంది. దీంతో మండల కేంద్రంలో ట్రాఫిక్ సమస్యలు మరింత పెరుగుతున్నాయి. గతంలో బస్టాండ్‌ను 1999లో రూ.70లక్షలతో నిర్మించారు. బస్టాండ్ నిర్మించిన 8నుంచి 10 ఏళ్ల పాటు ప్రయాణికులకు మంచి సేవలను అందించింది. కాని ప్రస్తుతం బస్సులు మండల కేంద్రంలో సెంటర్‌లో నిలపడం, బస్టాండ్‌లో కంట్రోలర్ లేకపోవడంతో బస్సులు లోనికి రాకుండా వెళ్తున్నాయి

బస్టాండ్‌ను వినియోగంలోకి తీసుకురావాలి



మండల కేంద్రంలో ఉన్న ఆర్టీసీ బస్టాండ్‌ను వినియోగంలోకి తీసుకువచ్చేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలి. ఈ బస్టాండ్‌లోకి బస్సులు రాకపోవడంతో చాలాకాలంగా నిరుపయోగంగా ఉంది. బస్టాండ్‌ను ఉపయోగంలోకి తీసుకురావడంతో పాటు రోడ్లపై ట్రాఫిక్ సమస్యను కూడా పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.

– పోకల వెంకటేశ్వర్లు, సీపీఐ మండల కార్యదర్శి, గరిడేపల్లి

అయ్యప్పస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం

అనంతగిరి : మండల కేంద్రంలోని శ్రీ హరిహర పుత్ర అయ్యప్పస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, మూల మంత్ర హోమాలు, సహస్ర ఘటాభిషేకం, పడిపూజ, విశేష పూజలు వైభవంగా నిర్వహించారు. అనంతరం నూతన యాగశాల, అన్నదాన మండపం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, ఎంపీపీ చుండూరు వెంకటేశ్వరరావు, ఆలయ ట్రస్ట్ చైర్మన్ కొండపల్లి వాసు, సర్పంచ్‌లు, వేనేపల్లి వెంకటేశ్వర్‌రావు, జొన్నలగడ్డ శ్రీనివాసరావు, ముత్తినేని కోటేశ్వర్‌రావు, లింగా రాఘవరెడ్డి, లక్ష్మాల వెంకటప్పయ్య, సింగిల్ విండో చైర్మన్ డేగబాబు, అర్వపల్లి సత్యనారాయణ, జగిని ప్రసాద్, వీరయ్య, బాపూజీరెడ్డి, కొండయ్య, కుమార్, కృష్ణయ్య, వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

మఠంపల్లిలో క్యాన్సర్ నిర్ధారణ వైద్యశిబిరం


వైద్యపరీక్షల కోసం పేర్లు నమోదు చేయించుకుంటున్న మహిళలు

మఠంపల్లి : మండల కేంద్రంలోని శుభవార్త చర్చి కమ్యూనిటీ హాల్లో ఆదివారం హైదరాబాద్‌కు చెందిన ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో స్థానిక శుభోదయ యువజన సంఘం, చర్చి కమిటీ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలకు విశేష స్పందన వచ్చింది. ఈ వైద్యశిబిరంలో సుమారు 230మంది మహిళలకు గర్భకోశ, రొమ్ము, నోటి క్యాన్సర్ తదితర నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరాన్ని పాదర్ మార్టిన్ ప్రారంభించారు. కార్యక్రమంలో శుభోదయ యువజన సంఘం అధ్యక్షుడు జయభారత్‌రెడ్డి, సెయింట్ ఆన్స్ సిస్టర్ బాలసుందరి, సిస్టర్ రూబీ, ఎంఎన్‌జే వైద్యబృందం డాక్టర్లు, సౌజన్య, అమిన్, సుస్మిత తదితరులు ఉన్నారు.

పత్రికలు ప్రజలను చైతన్యం చేయాలి

- ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హుజూర్‌నగర్ : పత్రికలు ప్రజలను చైతన్యవంతం చేసి ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎంపీ క్యాంప్ కార్యాలయంలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) ముద్రించిన డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యానికి ముప్పువాటిలినప్పుడు పత్రికలు ప్రజలను చైతన్యవంతం చేయాలన్నారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమాన్ని పతాకస్థాయికి తీసుకెళ్లడంలో పత్రికలు కీలకపాత్ర పోషించాయని అన్నారు. ప్రభుత్వాలకు, ప్రజలకు వారధిగా సమస్యల పరిష్కారంలో తమవంతు కృషి చేయాలని కోరారు. పత్రికా స్వేచ్ఛ ఉన్నప్పుడే ప్రజాస్వామ్యం మునగడ ఉంటుందని, తెలంగాణలో మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో పత్రికలు నిస్వార్థంగా పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు కోల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు జి.నిరంజన్, జర్నలిస్టులు డి.దయాకర్‌రెడ్డి, పి.భాస్కర్, ఆర్వీగౌడ్, డి.వెంకటరెడ్డి, అంజయ్య, రామకృష్ణ, నాయకులు మల్లికార్జున్, సుబ్బారావు, మంజునాయక్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.


డైరీ ఆవిష్కరిస్తున్న ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, యూనియన్ నాయకులు

వైభవంగా శ్రీవేణుగోపాలస్వామి కల్యాణం

మఠంపల్లి : మండలంలోని చౌటపల్లిలో శ్రీరుక్మిణీ సత్యభామా సమేత శ్రీవేణుగోపాలస్వామి తిరుకల్యాణాన్ని ఆదివారం రాత్రి అర్చకులు అత్యంత వైభవంగా నిర్వహించారు. ముందుగా ఆలయంలో నిర్వహిస్తున్న సుదర్శన హోమాన్ని మహాపూర్ణాహుతి గావించారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను మేళతాళాలు, కోలాట భజనలతో ఆలయం నుంచి ఊరేగింపుగా కల్యాణ మండపానికి తీసుకొచ్చారు. కల్యాణతంతులో భాగంగా విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, మధుఫర్కపూజ, మాంగల్యధారణ, తలంబ్రాలతో అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈఓ ఎంపీ లక్ష్మణ్‌రావు, ఆలయ అర్చకులు నరగిరినాథుని కృష్ణమాచార్యులు, వెంకట నరసింహాచార్యులు, తిరునగరి శ్రీనివాసాచార్యులు, సాయికుమారా చార్యులు, సర్పంచ్ కృష్ణవేణినరేష్, ఆలయ కమిటీ మాజీ చెర్మన్ మద్ది హుస్సేన్‌రెడ్డి, ఆలయ సిబ్బంది యరగాని కిరణ్‌గౌడ్, వై.గోపాలకృష్ణ, మాజీ ధర్మకర్తలు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.


హోమం నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి

హుజూర్‌నగర్ : నిరుద్యోగ యువత గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. పట్టణంలో నిర్మించనున్న గ్రంథాలయ భవనానికి ఆదివారం నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డితో కలిసి ఆయన భూమిపూజ, శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. నిరుద్యోగుల కోసం తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగ నోటిఫికేషన్‌లు విడుదల చేస్తున్న నేపథ్యంలో గ్రంథాలయం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. గతంలో ఉన్న గ్రంథాలయ భవనం నిజాం పాలనలో నిర్మించారని, ఇన్నాళ్లు ఉన్న ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేసిన కారణంగా అది పూర్తిగా శిథిలావస్థకు చేరిందన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ఇచ్చిన ప్రత్యేక నిధుల రూ.63లక్షలతో భవనం నిర్మిస్తున్నట్లు, త్వరలో అన్ని సౌకర్యాలతో కూడిన గ్రంథాలయం అందుబాటులోకి వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గెల్లి అర్చన, వైస్‌చైర్మన్ జె.నాగేశ్వరరావు, డీసీసీబీ డైరెక్టర్ రంగాచారి, పీహెచ్‌ఎంఈడీ డీఈ రమాదేవి, ఏఈఈ స్వాతి, గ్రంథాలయ అధికారి శ్రీధర్‌రెడ్డి, పలువురు కౌన్సిలర్లు, బీఆర్‌ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం పరిశీలన..

పట్టణంలో నూతనంగా నిర్మించిన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డితో కలసి పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్, ఏఎంసీ మాజీ చైర్మన్ కె.వెంకటరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు అమర్‌నాథ్‌రెడ్డి, అమర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రి ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ

పట్టణంలోని ఏరియా ఆస్పత్రిని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి ఆదివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రిసెప్షన్ డ్యూటీ నర్సులను ఇన్‌పేషంట్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆటో ప్రమాదంలో గాయపడిన మిరపకూలీల చికిత్స గురించి ఆరా తీశారు. వారికి మెరుగైన చికిత్స అందించాలని ఆదేశించారు.

సోమప్ప ఆలయ జాతర పోస్టర్ ఆవిష్కరణ..

నేరేడుచర్ల మండలంలోని బూర్గులతండాలో ఈనెల 16నుంచి 20వరకు నిర్వహించే శ్రీ భ్రగుమాలిక సోమేశ్వరస్వామి (సోమప్ప దేవాలయం) మహాశివ రాత్రి ఉత్సవాల వాల్‌పోస్టర్‌ను ఎమ్మెల్యే సైదిరెడ్డి స్థానిక క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో కమిటీ చైర్మన్, సభ్యులు, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే ప్రధాన లక్ష్యం

గరిడేపల్లి : ఎవరు ఎన్ని విమర్శలు చేసినా తాను నియోజకవర్గ అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా ముందుకెళ్తానని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని మునుగోడు గ్రామంలో జరుగుతున్న శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణ బ్రహ్మోత్సవాల్లో ఎమ్మెల్యే దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మునుగోడు గ్రామ అభివృద్ధికి రూ.కోటి వరకు నిధులను మంజూరు చేసినట్లు తెలిపారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కడియం వెంకట్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ పెండెం శ్రీనివాస్‌గౌడ్, సర్పంచ్ జోగు సరోజనమ్మ, జోగు అరవింద్‌రెడ్డి, ఎంపీటీసీలు వెంకటరమణ, రామ్‌సైదులు, అంజి, ఆలయ పూజారీ ఆలహరి నరసింహాచార్యులు తదితరులున్నారు.


హుజూర్‌నగర్ : భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యేలు సైదిరెడ్డి, భూపాల్‌రెడ్డి


గరిడేపల్లి : కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే సైదిరెడ్డి-రజిత దంపతులు

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

మఠంపల్లి : మండల కేంద్రంలోని గ్రే గోల్డు సిమెంట్ పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో మృతిచెందిన మునగపాటి సైదులు, పట్టేటి సాయి కుటుంబ సభ్యులను, గాయపడి చికిత్స పొందుతున్న మల్లెబోయిన సైదులును ఆదివారం ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి పరామర్శించారు. అదేవిధంగా ఇటీవల మృతి చెందిన సోమయాజుల వరలక్ష్మిదేవి భర్త బ్రహ్మశ్రీ సోమయాజుల లక్ష్మీనృసింహశాస్త్రి కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటామని తెలిపారు. ఆయన వెంట స్థానిక సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ సైదమ్మ, మాజీ సర్పంచ్ సుధాకర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు రామచంద్రయ్య, తదితరులున్నారు.

రైతులకు సరైన ఎరువులను సిఫారసు చేయాలి


మాట్లాడుతున్న సూర్యాపేట జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రామారావునాయక్

గరిడేపల్లి: ఫర్టిలైజర్ డీలర్లు తమ దగ్గరికి వచ్చే రైతులకు సరైన ఎరువులు, పురుగు మందులు సిఫారసు చేయాలని సూర్యాపేట జిల్లా వ్యవసాయశాఖ అధికారి డి. రామారావునాయక్ సూచించారు. మండలంలోని గడ్డిపల్లిలో గల కృషి విజ్ఞాన కేంద్రంలో ఆదివారం ఫర్టిలైజర్ డీలర్లతో నిర్వహించిన దేశీ కోర్స్ చివరి శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గడువు దాటిన పురుగు మందులను ఎట్టి పరిస్థితుల్లో రైతులకు అమ్మవద్దని అన్నారు. రసాయన ఎరువులతో పాటు సేంద్రియ, జీవ ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. గత 48వారాలుగా దేశీ కోర్స్‌లో భాగంగా చర్చించిన వివిధ అంశాలను పునః సమీక్షించి డీలర్లకు వివరించారు. కార్యక్రమంలో దేశీ కోర్స్ ఫెసిలిటేటర్ పి. శంకర్, కేవీకే శాస్త్రవేత్తలు బి. లవకుమార్, ఆదర్శ్, డీలర్లు యాదగిరి, బక్కయ్య, సైదులు, వెంకన్న, రాంరెడ్డి, హన్మంతరావు, నగేష్, శ్రీనివాస్‌రావు, వెంకటేశ్వర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. కూలీలకు గాయాలు

మేళ్లచెరువు : ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి కూలీల ఆటో అదుపుతప్పి బోల్తా కొట్టడంతో ఇద్దరికి తీవ్ర, పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని రేవూరు వద్ద ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గరిడేపల్లి మండలం రంగాపురం గ్రామానికి చెందిన 15 మంది కూలీలు ఆటోలో చింతలపాలెం మండలం దొండపాడు శివారులో మిరప కాయలు కోయడానికి వెళ్తున్నారు. మార్గమధ్యలో వీరు ప్రయాణిస్తున్న ఆటో మండలంలోని రేవూరు వద్దకు రాగానే ఎదురుగా వచ్చిన లారీని తప్పించబోయి బోల్తా కొట్టింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న కూలీలు సైదమ్మ, ఎల్లమ్మకు తీవ్ర, మరికొందరికి స్వల్ప గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన ఇద్దరిని తొలుత హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఖమ్మం ఆస్పత్రికి తీసుకెళ్లారు. స్వల్పగాయాలైన వారికి స్థానికంగా ప్రథమ చికిత్స నిర్వహించి పంపించారు. ఈ సంఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.


ఘటనాస్థలిలో బోల్తా కొట్టిన ఆటో

బీజేపీ బలోపేతానికి కృషిచేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న విజయ్‌కుమార్

నేరేడుచర్ల : బీజేపీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆపార్టీ మండల అధ్యక్షుడు పార్శనబోయిన విజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక బీజేపీ కార్యాలయంలో జరిగిన శక్తి కేంద్రాల ఇన్‌చార్జ్‌ల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈనెల 10నుంచి మండలంలోని బూత్ స్థాయిలో అధ్యక్షులు, కార్యదర్శులతో కలిసి సమావేశాలను నిర్వహించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలపై ఇంటింటికి వెళ్లి వివరించాలన్నారు. సమావేశంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి పగిడి శ్రీనివాస్, శక్తి కేంద్రాల ఇన్‌చార్జ్‌లు కరణం సత్యనారాయణ, విజయ్‌రెడ్డి, ప్రవీణ్, పవన్, సతీష్, సత్యం, నాయకులు తదితరులున్నారు.

బ్రహ్మం మృతి బాధాకరం

మునగాల : మండలంలోని విజయరాఘపురం గ్రామానికి చెందిన పెరిక సంఘం నాయకుడు సుంకర బ్రహ్మం(40) ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వనపర్తి లక్ష్మీనారాయణవర్మ అన్నారు. ఈ మేరకు ఆయన బ్రహ్మం మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో పెరిక సంఘం జిల్లా ప్రచార కార్యదర్శి తిపిరిశెట్టి రాజు, కోదాడ పట్టణ అధ్యక్షుడు బచ్చు అశోక్ ఉన్నారు.

వేతన ఒప్పంద చర్చలు వాయిదా

హుజూర్‌నగర్ : పట్టణంలోని రైస్‌మిల్లుల్లో పనిచేసే డ్రైవర్ల వేతన ఒప్పంద చర్చలు స్థానిక రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో ఆదివారం కార్మిక సంఘ నాయకులకు, అసోసియేషన్ సభ్యులకు మధ్య జరిగాయి. సమావేశంలో వేతనాల పెంపుపై సయోధ్య కుదరకపోవడంతో వాయిదా వేశారు. సమావేశంలో మిల్లర్స్, కార్మికులు, నాయకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

హుజూర్‌నగర్ : పట్టణంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాతఃకాలంలో నిత్యహోమం, ప్రాబోధిక పూజలు నిర్వహించారు. శ్రీరామ, లక్ష్మి, రామానుజ, అష్టోత్తరాలు, తిరుప్పావై సేవా కాలం పటించారు. సీతారామచంద్రస్వామిని పట్టువస్త్రాలు, పూలమాలలతో అందంగా అలంకరించి పల్లకిలో అధిష్ఠింపజేసి మేళతాళాలతో గుట్ట చుట్టూ ప్రదక్షిణం గావించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ, అభివృద్ధి కమిటీ సభ్యులు, అర్చకులు, స్థానాచార్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

వెంకయ్య మృతి తీరనిలోటు


నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

హుజూర్‌నగర్‌రూరల్ : సీపీఎం సీనియర్ నాయకుడు చీకూరి వెంకయ్య మృతి పార్టీకి తీరని లోటని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పారేపల్లి శేఖర్‌రావు, నాగారపు పాండు అన్నారు. ఆదివారం మండలంలోని గోపాలపురంలో మాజీ సర్పంచ్ చీకూరి తిరుపతయ్య తండ్రి వెంకయ్య(98) భౌతికకాయానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. నివాళులర్పించిన వారిలో ఎంపీపీ గూడెపు శ్రీనివాస్, సర్పంచ్ నాగసైదయ్య, ఎంపీటీసీ రాజారావు, గురవయ్య, నాయకులు పల్లె వెంకటరెడ్డి, హుస్సేన్, సీతయ్య, వెంకటరెడ్డి, భిక్షం, మాధవరావు ఉన్నారు.

బోడిగుట్ట జాతరకు పోటెత్తిన భక్త జనం

- కోదాడలో మొదటిసారిగా నిర్వహిస్తున్న లింగమంతుల స్వామి జాతర
- దేవరపెట్టె ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యేలు, రాజ్యసభ సభ్యుడు

కోదాడఅర్బన్ : పట్టణంలోని అనంతగిరి రోడ్డులో గల బోడిగుట్టపై జీర్ణోద్ధరణ చేసిన లింగమంతుల స్వామి జాతర ఆదివారం వైభవంగా ప్రారంభమైంది. మొట్టమొదటి సారిగా నిర్వహిస్తున్న ఈ జాతర ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. జాతరకు భక్త జనం పోటెత్తడంతో పాటు ఓ లింగ నామస్మరణంతో పట్టణం మారుమ్రోగింది. జాతర సందర్భంగా దేవరపెట్టెను ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య ఇంటి నుంచి శివసత్తుల విన్యాసాలు, యాదవుల సంప్రదాయ నృత్యాలు, మహిళా భజన కోలాట బృందాలు, డప్పు వాయిద్యాలు, నవదుర్గల వేషధారుల విన్యాసాల నడుమ పట్టణంలోఊరేగింపుగా ఆలయానికి చేర్చారు. ఈ ఊరేగింపులో ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్‌తో పాటు రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, హుజూర్‌నగర్, నకిరేకల్ ఎమ్మెల్యేలు శానంపూడి సైదిరెడ్డి, చిరుమర్తి లింగయ్య పాల్గొని దేవరపెట్టెను మోశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజాన్ని ఉత్తేజ పరుస్తాయన్నారు. ఈ కార్యక్రమాలు సమాజ శ్రేయస్సుకు దోహదపడుతాయని, ప్రజల ఐక్యమత్యాన్ని చాటుతాయన్నారు. ఈ లింగమంతుల ఆలయం కోదాడ ప్రాంతానికి చారిత్రాత్మకంగా నిలిచి పోతుందన్నారు. కాగా పట్టణానికి చెందిన 15వ వార్డు కౌన్సిలర్ ఎస్‌కే షఫీ ఊరేగింపులో పాల్గొన్న భక్తులకు మినరల్ వాటర్‌బాటిల్స్ సరఫరా చేసి తన మతసామరస్యాన్ని చాటుకున్నాడు. కార్యక్రమంలో పలు కులాల వారు పాల్గొన్నారు.


లింగమంతులస్వామి దేవరపెట్టె ఊరేగింపులో పాల్గొన్న భక్తులు


దేవరపెట్టెను తీసుకెళ్తున్న ఎంపీ లింగయ్య, ఎమ్మెల్యేలు బొల్లం, సైదిరెడ్డి, లింగయ్య


ఊరేగింపులో ఆకర్షణగా నిలిచిన నవదుర్గ వేషధారణలు

క్లుప్తంగా

బియ్యం అందజేత


బియ్యం అందజేస్తున్న దాతలు

గరిడేపల్లి : మండల కేంద్రంలోని ఎస్సీకాలనీకి చెందిన అల్లం చంద్రమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందింది. దీంతో ఓజో ఫౌండేషన్ చైర్మన్ పిల్లుట్ల రఘు సహకారంతో బాధిత కుటుంబానికి 100కిలోల బియ్యాన్ని ఫౌండేషన్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కుక్కల వెంకన్న అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు బొమ్మ వెంకటేశ్వర్లు, కానుగు రాంబాబు గౌడ్, పెండెం వినయ్, గోపి, మైసయ్య తదితరులున్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

హుజూర్‌నగర్ : పాలకవీడు మండలంలోని నర్లింగలగూడెం గ్రామానికి చెందిన గుగులోతు వెంకటేశ్వర్లు ఆదివారం జిల్లా రైతు సమన్వయ కమిటీ సభ్యుడు దుర్గారావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో లక్ష్మీదేవి పూజలు


పూజలు నిర్వహిస్తున్న భక్తులు

నడిగూడెం : మండల పరిధిలోని రత్నవరంలో శ్రీ సీతారాముల ఆలయంలోని లక్ష్మీదేవి విగ్రహం వద్ద ఆదివారం భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ కీసర లలితారెడ్డి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

చేనేతను ప్రోత్సహించాలి

హుజూర్‌నగర్ : ప్రతిఒక్కరూ చేనేతను ప్రోత్సహించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గెల్లి అర్చన అన్నారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన చేనేత హస్తకళా ప్రదర్శనను ఆమె ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు వి.నాగేశ్వరరావు, గాయత్రి, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు డబుల్‌బెడ్‌రూం ఇళ్లను కేటాయించాలి


ఇళ్లను పరిశీలిస్తున్న బీజేపీ నాయకురాళ్లు

కోదాడ : ప్రభుత్వం పట్టణంలోని బాలాజీనగర్‌లో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను నిరుపేదలకు కేటాయించాలని బీజేపీ మహిళా జిల్లా కార్యదర్శి చలిగంటి ప్రమీల డిమాండ్ చేశారు. ఆదివారం ఆమె చెత్తసేకరించే మహిళలతో కలిసి ఇళ్లను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడారు. ఇళ్ల నిర్మాణం జరిగి రెండు సంవత్సరాలు పూర్తి కావస్తున్నా నేటి వరకు పంపిణీ చేయకపోవడంతో అవి శిథిలావస్థకు చేరుకున్నాయని, వాటిని వెంటనే పేదలకు పంచాలని డిమాండ్ చేశారు.

మృతుల కుటుంబాలకు పద్మావతి పరామర్శ


మృతుల కుటుంబాలను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే పద్మావతి

నడిగూడెం : మండల పరిధిలోని కాగితరామచంద్రాపురం గ్రామానికి చెందిన పఠాన్‌షరీఫ్(35), షేక్.అబ్దుల్‌గని(38) ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. దీంతో మృతుల చిత్రపటాలకు మాజీ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబాలను పరామర్శించారు. ఆమె వెంట పలువురు కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

భోజనశాలకు విరాళం

నడిగూడెం : మండల కేంద్రంలోని శ్రీ షిర్డీ సాయి మందిరంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో హైదరాబాద్‌కు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు సామినేని పూర్ణచందర్‌రావు స్వర్ణ దంపతులు ఆలయ ఆవరణలో నిర్మించనున్న భోజనశాలకు రూ.25వేలు నగదు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు మండవ వెంకటేశ్వరరావు, కార్యదర్శి కృష్ణయ్య, గౌరవసలహాదారుడు భిక్షం, తదితరులు పాల్గొన్నారు.

శోకసంద్రంలో కాగితరామచంద్రాపురం

నడిగూడెం : మండల పరిధిలోని కాగితరామచంద్రాపురం గ్రామానికి చెందిన పఠాన్‌షరీఫ్ (35), షేక్.అబ్దుల్ గని (38) ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. దీంతో గ్రామం శోకసంద్రంలో మునిగిపోయింది. మృతులు గ్రామంలో అందరితో కలుపుగోలుగా ఉండేవారని గ్రామస్తులు తెలిపారు.